ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
ఆదివారం 15 డిసెంబరు 2024



పెట్టుబడిదారులకు వెబ్3 సహకారం


బెంగళూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రీ ఫోరం అన్ ఫోల్డ్ పెట్టుబడిదారులను ప్రోత్సహించేందుకు వెబ్3 కంపెనీలను ఒకచోట చేర్చిందని కాయిన్ డిసిఎక్స్ కోఫౌండర్ సుమిత్‌గుప్త అభిప్రాయపడ్డారు. అన్‌ఫోల్డ్ 2024 సదస్సు నగరంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన వెబ్ 3.0 పర్యావరణ వ్యవస్థ యొక్క అపారమైన శక్తి సామర్థ్యాన్ని ప్రదర్శించిందన్నారు. 2022లో క్రిప్టో కరెన్సీ రంగంలో దేశంలో పలు విధాల ప్రగతికి దోహదపడ్డాయన్నారు. అన్‌ఫోల్డ్ సదస్సుకు 1500మంది హాజరుకాగా ఇందులో 60మంది ప్రముఖ వెబ్3 నిపుణులు, వ్యవస్థాపకులు పాల్గొన్నారు.



పురుడుకు..

పుట్టెడు కష్టాలు..!

రాష్ట్రంలో ప్రమాదకరంగా ప్రసవాలు



- మూడేళ్లలో 2,079 మంది బాలింతల మృత్యువాత
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాసిరకం మందులు, ఫ్లూయిడ్స్
- బళ్లారి జిల్లా ఆసుపత్రికి తగ్గిన గర్భిణుల రాక
- నిర్లక్ష్యం వీడకపోతే మరింత ప్రమాదం

బెంగళూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్రంలో బాలింతల మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. గతంలో సూలగత్తెలే పురుడు పోసేవారు. పల్లెపట్నం ఏదైనా ఇంటిపట్టునే కాన్పులు చేసేవారు. ఆ తర్వాత తాలూకాస్థాయి ఆసుపత్రులు వచ్చాక అత్యవసరమైతే ఆస్పత్రులకు వెళ్లేవారు. అక్కడ ప్రత్యేకంగా ఉండే లేబర్‌వార్డుల్లో కాన్పులు జరిగేవి. మిడ్‌వైఫ్‌లు అత్యవసరమైతే పల్లెలకు వెళ్లి కాన్పులు జరిపించేవారు. కానీ ఇటీవల గ్రామాలవారీగా నర్సులు, మండలస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), తాలూకా స్థాయిలో ఆసుపత్రులు, నియోజకవర్గ స్థాయిలో 50 పడకల ఆసుపత్రులు ఏర్పాటయ్యాయి. కాన్పుల సమయంలో తల్లితోపాటు నవజాత శిశువుల మరణాలను తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో ప్రత్యేకమైన వైద్యవిధానాలను, పథకాలను అందుబాటులోకి తెచ్చారు. ఇటువంటి ఆధునిక కాలంలోనూ రాష్ట్రంలో ప్రసవమే ప్రమాదంగా మారిపోయింది. 2021 - 22 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24 దాకా గణాంకాలను పరిశీలిస్తే బెంబేలెత్తే పరిస్థితి నెలకొంది. 4.29 లక్షలమంది కాన్పులు చేసుకున్నారు. ప్రసవ సమయంలోనే 822 మంది తల్లులు మృతి చెందారు. ఆ తర్వాత కాన్పుకు అటు ఇటుగా 2,079 మంది తల్లులు మృతి చెందారు. ఇటీవల కొన్ని రోజుల వ్యవధిలోనే బళ్ళారి ఆసుపత్రిలో ఆరుగురు బాలింతలు మృతి చెందిన విషయం సంచలనమైంది. ఇక బెళగావి, తుమకూరుల్లోనూ ఇదే తరహాలోనే తల్లులు మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈ రెండు మూడు జిల్లాలే కాకుండా రాష్ట్రమంతటా ప్రసవ సమయంలోనే తల్లులు మృత్యువాత చెందిన సంఘటన అన్ని జిల్లాల్లోనూ చోటు చేసుకున్నాయి. మూడేళ్ల వ్యవధిలో 2079 మంది తల్లులు పురుడు తర్వాత మృతి చెందారంటే గర్భిణిలుగా ఎంతమంది ఆసుపత్రికి చేరకముందే అశువులు బాశారనేది అర్థంకాని పరిస్థితిగా మారింది.

బళ్ళారిలో రోజుల వ్యవధిలోనే బాలింతల మృతి చెందడం రాష్ట్రమంతటా సంచలనమైంది. మంత్రులు, అధికారులు, బళ్ళారి ఆసుపత్రికి వెళ్లి పరిశీలనలు, పరామర్శలు, సమీక్షలు చేపట్టారు. మరోవైపు మందుల నాసిరకంపైనా స్పందించారు. మూడేళ్లలో పరిశీలిస్తే కల్యాణ కర్ణాటకలో 502మంది తల్లులు పురుడుకు అటు ఇటుగా మృతి చెందారు. వీరిలో కలబురగిలోనే అత్యధికంగా 180మంది మృతి చెందారు.

తల్లీబిడ్డల సంక్షేమానికి ఎన్నో సేవలు

దేశవ్యాప్తంగా తల్లీబిడ్డల మరణాల శాతాన్ని తగ్గించేందుకు ఎన్నో విధాల సహకారం సరళీకృతం చేశారు. ఒకప్పుడు కాన్పుకు వెళ్లాలంటే కుటుంబ సభ్యులు వారి సొంత వాహనాలలో తీసుకెళ్లేవారు. కుటుంబ సభ్యులు మినహా మిగిలినవారెవ్వరూ గర్భిణీలను, బాలింతలను పర్యవేక్షించే విధానం ఉండేది కాదు. ప్రస్తుతం అంగన్‌వాడీ వ్యవస్థ ద్వారా గర్భిణీలను పర్యవేక్షిస్తుంటారు. వారికి పౌష్టికాహారం ఇవ్వడం ఇతరత్రా సలహా సూచనలు సమకూరుస్తారు. ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పల్లెనుంచి పట్టణం దాకా గర్భిణీలను పర్యవేక్షిస్తుంటారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సమాచారం ఇస్తే సమీపంలోని తాలూకా ఆసుపత్రుల్లో ప్రసవం చేసేందుకు వైద్యులను అలర్ట్ చేస్తారు. జిల్లాస్థాయిలో మెడికల్ కళాశాలలు అందుబాటులో ఉండడంతో అత్యవసరమైతే గంటల వ్యవధిలోనే జిల్లా ఆసుపత్రులకు తరలిస్తారు. వీటన్నింటికీ ప్రభుత్వ అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉన్నాయి.

బాలింతల మృతికి కారణాలు

- బాల్య వివాహాలు పెరగడం
- నెలలు నిండకముందే ప్రసవం కావడం
- తల్లికి ఇతరత్రా అనారోగ్య సమస్యలు
- రక్తహీనత, పౌష్టికాహార లోపం
- బాల్యంలోనే గర్భిణీలు కావడం
- బీపీ, హృదయ, లివర్, కిడ్నీ సమస్యలు
- భారీ స్థూలకాయం ఉండేవారికి కాన్పువేళ ఇన్‌ఫెక్షన్
- ఇంట్లోనే కాన్పులు జరపడం
- గర్భిణులు నియమిత సమయంలో వైద్యులను సంప్రదించకపోవడం, తరచూ పరీక్షలు జరిపించకపోవడం వంటివి కారణాలుగా ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా బలవుతున్నారు.



సభలో మాట్లాడుతున్న స్పీకర్ (ఫైల్)

సభలో చర్చకు ప్రతిపక్షాల పట్టు

శాసనసభ శీతాకాల సమావేశాలు జరుగుతున్న బెళగావితోపాటు బళ్ళారిలలో వరుసగా బాలింతల మృతి చెందిన సంఘటనపై శాసనసభలో చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టేందుకు సిద్ధమయ్యాయి. శాసనసభ కలాపాలలో తొలివారం పలు అంతరాయాలు చోటు చేసుకున్నాయి. తొలిరోజున వక్ఫ్ వివాదంపై చర్చ జరిగింది. సంతాప తీర్మానాలు, వక్ఫ్ అంశానికే పరిమితమైంది. రెండోరోజున మంగళవారం మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ మృతితో సంతాప సందేశానికే పరిమితమైంది. మూడోరోజు కలాపాలు జరగలేదు. నాలుగు, ఐదు రోజులు కలాపాలు జరిగినా పంచమశాలిల అంశం తీవ్ర వివాదానికి కారణమైంది. ఇలా మొదటివారంలో శాసనసభ కలాపాలకు తీవ్రమైన అంతరాయం ఏర్పడింది. రెండోవారం సోమవారం నుంచి ప్రారంభమవుతున్న తరుణంలో బాలింతల మృతిపై చర్చలకు ప్రతిపక్షాలు డిమాండ్ చేసే అవకాశం ఉంది. తల్లీబిడ్డల మృతిపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలనే డిమాండ్ ప్రతిచోటా చర్చనీయాంశం అవుతోంది.

బళ్లారి ఆసుపత్రి అంటే భయం..భయం..

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నిన్నమొన్నటి వరకు గర్భిణీలు, మహిళలతో బిజీగా ఉన్న నగరంలోని జిల్లా ఆసుపత్రి ప్రస్తుతం బోసిపోతోంది. జిల్లా ఆసుపత్రిలో వైద్యం అంటేనే పేద ప్రజలు బెంబేలెత్తేలా తయారయ్యింది. జిల్లా ఆసుపత్రిలో ప్రసూతి కోసం వచ్చే గర్భిణీల సంఖ్య గణనీయంగా తగ్గింది. గత నెలలో సిజేరియన్ ఆపరేషన్ చేయించుకున్న ఐదుగురు బాలింతలు మృతి చెందడం రాష్ట్ర వ్యాప్తం కలకలం రేపింది. దీంతో ప్రభుత్వ వైద్యం అంటేనే ప్రజల్లో ఆందోళన నెలకొంది. జిల్లాలోని పలు గ్రామీణ ప్రాంతాల వారు సైతం ఆస్పత్రికి రాకుండా ప్రైవేట్ బాట పడుతున్నారు. గత మూడు నెలల నమోదు ప్రక్రియను పరిశీలిస్తే సెప్టెంబరు నెలలో 585 మంది గర్భిణీ స్త్రీలు నమోదు చేయించుకోగా, అక్టోబరు నెలలో 577 జిల్లా ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలు ప్రసవం చేయించుకున్నారు. అదే విధంగా నవంబరు జరిగిన వరుస బాలింతల మృతి తర్వాత దాదాపుగా సగానికి తగ్గి కేవలం 289 మంది మాత్రమే జిల్లా ఆసుపత్రిలో ప్రసూతి చేయించుకోవడం గమనార్హం. ఏటా జిల్లా ఆసుపత్రిలో సుమారు ఆరువేల మందికి ప్రసూతి జరుపుతున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. ప్రతి నెలా కనీసం 500మంది ప్రసూతి కోసం చేరేవారని తెలుస్తోంది. అయితే ఒకే నెలలో సగానికి తగ్గిపోవడం ఇదే మొదలని వైద్య వర్గాలు భావిస్తున్నారు. బాలింతల వరుస మృతి, అభద్రత, వైద్యుల నిర్లక్ష్యం అనే భావన, నాసిరకం మందులు, కాలం చెల్లిన మందులు ఉపయోగిస్తున్నారన్న అనుమానం వ్యక్తమవుతున్న నేపథ్యంలో గర్భిణుల రాక భారీగా తగ్గిపోయింది. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్ళలేని నిరుపేద మహిళలు భగవంతుడిపై భారం వేసి ఆసుపత్రికి వస్తున్నట్లు కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నగరంలోని జిల్లా ఆసుపత్రి నిర్వహణలో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న బళ్ళారి జిల్లా ఆసుపత్రి మచ్చ రావడం నిజంగా బాధాకరం. ఇప్పటికైనా రాష్ట్ర, జిల్లా ఆరోగ్య శాఖ మేల్కొని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యంపై ప్రజల్లో నమ్మకం కలిగించేలా అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉంది.



ఖాళీగా ఉన్న బెడ్లు



పడిపోతున్నా పట్టించుకోం..!

- ప్రమాదకరంగా మారిన ఇనుప కడ్డీలు
- ప్రధాన రహదారి మరమ్మతుపై నిర్లక్ష్యం

ప్రమాదకరంగా మారిన ఇనుప కడ్డీలు 8

మంత్రి ఇంటి ముందు నిరసన



మంత్రి భోసరాజు ఇంటి ముందు ధర్నా చేస్తున్న నాయకులు 7



ఉల్లికోడు తెగులుతో

రైతులకు ఇబ్బందులు

- దెబ్బ తింటున్న నారుమళ్లు
- తీవ్రంగా నష్టపోతున్న అన్నదాత

తెగులు సోకిన నారుమళ్లు 8

ఆఫర్‌పై ఆరా..!

- వక్ఫ్ వివాదంలో కీలక మలుపు
- అన్వర్ మానప్పాడికి విజయేంద్ర ప్రలోభం
- సీబీఐ దర్యాప్తునకు సీఎం డిమాండ్



బెంగళూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ ఆస్తుల ఆక్రమణలపై బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య సాగుతున్న వివాదం కొత్త మలుపు తిరిగింది. శాసనసభలో శుక్రవారం ఐటీబీటీ శాఖల మంత్రి ప్రియాంకఖర్గే చేసిన సంచలన ఆరోపణలపై సీఎం స్పందించారు. శనివారం సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల అక్రమాలపై మౌనంగా ఉండేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తనకు రూ.150 కోట్లు ఇవ్వచూపారని, బీజేపీ పాలనలో మైనారిటీ కమిషన్ చైర్మన్ అన్వర్ మానప్పాడి ప్రధాని మోదీకి లేఖ రాసిన అంశాన్ని ప్రస్తావించారు. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించి సీబీఐ దర్యాప్తుకు ఆదేశించాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. యడియూరప్ప సీఎంగా ఉన్న కాలంలోనే విజయేంద్ర మా ఇంటికి వచ్చి వక్ఫ్ ఆస్తుల అక్రమాలపై ఎటువంటి వ్యాఖ్యలు చేయకుండా మౌనంగా ఉండాలని అందుకు రూ.150 కోట్లు ఇస్తామని ఆశ చూపారని సీఎం తెలిపారు. అయితే అన్వర్ మానప్పాడి నిరాకరించి పీఎంకు లేఖ రాశారన్నారు. ఈ అంశంపై మౌనంగా ఉండడం పలు అనుమానాలకు కారణమవుతోందన్నారు. వీరి ఆసక్తి చూస్తే వీరి కుటుంబం కూడా వక్ఫ్ ఆస్తుల్లో భాగస్వామ్యం ఉందనే అనుమానాలు వస్తున్నాయన్నారు. యడియూరప్ప, బసవరాజ్ బొమ్మైలు సీఎంగా ఉన్న కాలంలోనే వక్ఫ్ ఆస్తులకు సంబంధించి ఎక్కువ నోటీసులు ఇచ్చారన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్రానికి సంబంధించి బీజేపీ పాలనలో సాగిన అవినీతి వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని స్పందించాలని డిమాండ్ చేశారు. కొవిడ్ కాలంలో వస్తువుల కొనుగోళ్లలో భారీ అవినీతి జరిగిందని, వక్ఫ్ ఆస్తుల లూటీ జరిగిందన్నారు. సోమవారం ఇదే అంశంపై శాసనసభలో తీవ్రమైన చర్చ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రి ప్రియాంక ఖర్గే శాసనసభలో శుక్రవారం మాట్లాడిన వేళ 2021 మేలో అప్పటి మైనారిటీ కమిషన్ చైర్మన్ అన్వర్ మానప్పాడి, ప్రధానమంత్రికి లేఖ రాశారన్నారు. వక్ఫ్ ఆస్తుల విషయంలో మౌనంగా ఉంటే రూ.150 కోట్లు ఇస్తానని విజయేంద్ర ఆఫర్ ఇచ్చారని నేరుగా ప్రధానికి లేఖ పంపారన్నారు. వక్ఫ్‌లో 2-3 లక్షల కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయని ఇందులో బీజేపీ నాయకుల భాగస్వామ్యం కూడా ఉందని, దీన్ని మూసివేసేందుకు విజయేంద్ర ప్రయత్నించారని ప్రియాంక ఖర్గే ఆరోపించారు.

ఉత్సాహంగా కాంగ్రెస్ శతాబ్ది సంబరాలు

- మైసూరు దసరా తరహాలో నిర్వహిస్తాం : డీసీఎం డీకే
- హాజరు కానున్న సోనియా, రాహుల్, ప్రియాంక

బెంగళూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బెళగావిలో కాంగ్రెస్ సమావేశం శతాబ్ది సంబరాన్ని మైసూరు దసరా కంటే ఉత్సాహంగా జరపదలిచామని డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. శనివారం సభ జరిగే మైదానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 1924లో మహాత్మాగాంధీ అధ్యక్షతన కాంగ్రెస్ సభ జరిగి వందేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఈనెల 26 నుంచి రెండురోజుల పాటు శతమానోత్సవ సంబరాన్ని జరుపుతామన్నారు. బెళగావి నగరంలో పండుగ వాతావరణం తీసుకొస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ తన చారిత్రాత్మక పయనాన్ని స్మరించి భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించదలిచిందన్నారు. రాష్ట్రంలో 2028లో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ఇక్కడనుంచే ఎన్నికల జోష్ ప్రారంభం కానుందన్నారు. మంత్రి సతీశ్‌జార్కిహోళి నేతృత్వంలో భోజన సదుపాయం ఉంటుందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన కాంగ్రెస్ స్వాభిమానం ఇక్కడనుంచే దేశవ్యాప్తంగా విస్తరింపచేయదలిచామన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు భవిష్యత్తుకోసం మన శక్తి, చరిత్ర ముందు ఏదీ గొప్పది కాదని నిరూపించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వంద కాంగ్రెస్ కార్యాలయాలను నిర్మించాలని నిర్ణయించామన్నారు. కాంగ్రెస్ శతమానోత్సవ సభలో పాల్గొనేందుకు పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలు రానున్నారన్నారు. వీరంతా ఇక్కడే ఒకరోజు ఉంటారన్నారు. 150మందికిపైగా ఎంపీలు, వివిధ రాష్ట్రాల కాంగ్రెస్ అధ్యక్షులు హాజరవుతారన్నారు. కాగా బెళగావి సభపై శనివారం బెంగళూరు కేపీసీసీలో పార్టీ ముఖ్యనాయకులు, వివిధ అనుబంధ సంస్థల ముఖ్యులతో సమావేశం జరిపారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

నెట్టికంటి సేవలో విద్యారణ్యభారతి స్వామీజీ

గుంతకల్లుటౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయాన్ని హంపీ పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య విద్యారణ్య భారతి స్వామీజీ శనివారం సందర్శించారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామి దర్శనం చేయించి పూజలు జరిపించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆ నలుగురు సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో విద్యారణ్యభారతి స్వామీజీ

కోటె ఆంజనేయస్వామికి విశేషపూజలు

శిడ్లఘట్ట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): హనుమద్వ్రతం పురస్కరించుకుని పట్టణంలోని వివిధ ఆలయాలలో శనివారం కూడా పూజలు కొనసాగాయి. కోటె ఆంజనేయ దేవాలయంలో వాసవి ఆలయంలో రామకోటి పారాయణ, శివనామాలను రాసి శృంగేరి మఠానికి సమర్పించారు. చింతామణి సర్కిల్‌లోని భక్తాంజనేయ ఆలయంలో హోమాదికాలు, శివ దీపోత్సవం నిర్వహించారు. తులసి, పూలమాలల తోపాటు వడల అలంకరణ నిర్వహించారు. హిందూ సంఘాల కార్య కర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.




వడల అలంకరణలో స్వామివారు

నగరంలో మరో సిటీ..!

- సర్జాపురలో స్విఫ్ట్ సిటీ.. వెయ్యి ఎకరాల్లో..
- ప్రభుత్వ పర్యవేక్షణలో నిర్మాణానికి ఏర్పాట్లు

బెంగళూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఐటీబీటీతోపాటు ఎంఎన్‌సీ కంపెనీల ఏర్పాటుకు అనుకూలంగా ఎలక్ట్రానిక్ సిటీ, ఐటీపీఎల్ సిటీలు నిర్మించిన తరహాలోనే రాష్ట్రప్రభుత్వం నగరంలోని సర్జాపుర పారిశ్రామికవాడలో వేయి ఎకరాలలో స్విఫ్ట్ సిటీని నిర్మించదలిచినట్లు రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఇటీవల ప్రకటించారు. దీంతో నగరంలో ఐటీ రంగానికి అనుకూలంగా మరో భారీ పారిశ్రామికవాడ రానుందని సంకేతాలు వెలువడ్డాయి. స్టార్టప్‌లు, వర్కింగ్ ప్లేస్, ఫైనాన్స్, టెక్నాలజీ వంటి విభాగాలకు అనుకూలంగా ఉండేలా నిర్మించదనున్నారు. ప్రస్తుతం బెంగళూరులో వెయ్యి ఎకరాలలో కొత్త సిటీని స్థాపించేందుకు సర్జాపుర పారిశ్రామికవాడలో వెయ్యి ఎకరాలను కేటాయించారు. బెంగళూరులో ప్రస్తుతం 5వేల కంపెనీలు ఉన్నాయి. వీటికి అవసరమైనంత వ్యవస్థీకృతమైన కేంద్రాలు లేవనే అసంతృప్తి ఉంది. దీంతో సర్జాపురలో సకల సౌలభ్యాలతో ఏర్పాటు చేయదలిచారు. అంతర్జాతీయస్థాయి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేయనున్నారు. పొరుగు రాష్ట్రాలలో ఇటీవల ఐటీ ప్రాధాన్యం పెరుగుతోంది. దక్షిణాది రాష్ట్రాలు ఐటీ పరిశ్రమలకు సౌలభ్యాలు కల్పించే విషయంలో ఉత్సాహం చూపుతున్నాయి. దీంతో ఉన్న పరిశ్రమలకు అవసరమైన సౌలభ్యాలు కల్పించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ రహదారి 44, 48లకు అనుబంధంగా ఉండే ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయదలిచారు. స్విఫ్ట్ సిటీని స్టార్టప్‌హబ్‌గా తీర్చదలిచారు. ప్లగ్ అండ్ ప్లే ప్రదేశంలో ఆధునాతనమైన ఆఫీసు భవనాలు, రెసిడెన్షియల్, కోవర్కింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.



సర్జాపుర ప్రాంత విహంగవీక్షణం

హక్కులను కాలరాస్తున్న పాలకులు

ప్రజా చైతన్యంతోనే తిప్పికొట్టడం సాధ్యం

మానవహక్కుల వేదిక మహాసభల్లో వక్తలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామిక హక్కులను పాలకులు కాలరాస్తున్నారని, ప్రజా చైతన్యం ద్వారానే ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడం సాధ్యమని మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) నాయకులు అన్నారు. అనంతపురంలోని ఓ ఫంక్షన్ హాల్లో వేదిక 10వ రాష్ట్ర మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఏపీ మానవ హక్కుల వేదిక అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ మాట్లాడారు. కరువులకు నిలయమైన అనంతపురం జిల్లా పౌర ఉద్యమాలకు పెట్టింది పేరని ఆయన అన్నారు. మానవ హక్కుల వేదిక ఉద్యమంతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. 2009లో అనంతపురంలో జరిగిన మానవహక్కుల వేదిక మూడో రాష్ట్ర మహాసభల్లో బాలగోపాల్‌తో కలిసి తాను పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు. దేశంలో అమలవుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజా చైతన్యంతోనే తిప్పిగొట్టగలమని అన్నారు. దేశంలో ప్రశ్నించే గొంతుకలను పాలకులు నిర్దాక్షిణ్యంగా అణచివేస్తున్నారని ఓపీడీఆర్ నాయకుడు రామ్‌కుమార్ విమర్శించారు. ఆదివాసి సమస్యలపై పోరాడే స్టాలిన్‌ను నిర్బంధించి చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన వర్గాల తరఫున గొంతెత్తేందుకు పౌరహక్కుల సంఘాలు మరింతగా ముందుకు పోవాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశంలో ప్రజాసంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని హెచ్ఆర్ఎఫ్ తెలంగాణ అధ్యక్షుడు భుజంగరావు విమర్శించారు. అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే క్రమంలో ఆదివాసీలను నిర్వాసితులుగా మార్చేస్తున్నారని అన్నారు. వారి హక్కులను పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రశ్నించే గొంతుకలను ఫేక్ ఎన్‌కౌంటర్ల పేరుతో, ఇతర రూపాల్లోనూ అణచివేస్తున్నారని డెమొక్రటిక్ పీపుల్స్ ఫోరం నాయకుడు శ్రీధర్ అన్నారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, అబ్దుల్ రసూల్, ఎస్ఎం బాషా, అనంతపురం జిల్లా నాయకులు సుబ్బన్న, ఆహ్వాన సంఘం నాయకులు దాదా గాంధీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు గేయానంద్


మహా సభలకు హాజరైన హెచ్ఆర్ఎఫ్ ప్రతినిధులు

కమిటీలు.. తీర్మానాలు

హెచ్ఆర్ఎఫ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కమిటీలను తొలిరోజు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ కమిటీ అధ్యక్షుడిగా శ్రీకాకుళానికి చెందిన జగన్నాథరావు, ప్రధాన కార్యదర్శిగా అమలాపురానికి చెందిన రాజేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ అధ్యక్షుడిగా ఉట్నూరుకు చెందిన ఆత్రం భుజంగరావు, ప్రధాన కార్యదర్శిగా జమ్మికుంటకు చెందిన డాక్టర్ ఎస్ తిరుపతయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు రాష్ట్రాల నుంచి 144 మంది ప్రతినిధులు హాజరయ్యారు. రానున్న రెండు సంవత్సరాలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కమిటీల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. నూతన కమిటీల సమక్షంలో 24 అంశాలపై తీర్మానాలు చేశారు. అనంతరం ఫంక్షన్ హాల్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకు 'ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి - వాక్ స్వాతంత్ర్య హక్కు వర్ధిల్లాలి' అని నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. మహాసభలలో రెండోరోజు ఆదివారం 'కులగణన ఎందుకు అవసరం' అనే అంశంపై సామాజిక విశ్లేషకుడు ఎస్ఎన్ సాహు, 'బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు' అనే అంశంపై స్వతంత్ర విలేకరి మాలిని సుబ్రహ్మణ్యం, 'కాషాయీకరణ, కార్పొరేటీకరణ' అనే అంశాలపై చరిత్ర విశ్రాంత అధ్యాపకుడు కొప్పర్తి వెంకటరమణమూర్తి ప్రసంగిస్తారు.

కలుగులో ఎలుకలు బయటికొచ్చాయ్..!


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీత

వైసీపీ నాయకులకు పరిటాల సునీత చురక

అనంతపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆరు నెలల పాటు కలుగులో దాక్కున్న ఎలుకలన్నీ బయటకొచ్చి కిసకిస అంటున్నాయని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత వైసీపీ నేతలను ఎద్దేవా చేశారు. వైసీపీ రైతు పోరుబాటపై శనివారం ఆమె స్పందించారు. రైతుల గురించి మాట్లాడే నైతికత ఆ పార్టీ నాయకులకు లేదని అన్నారు. కరువు జిల్లా రైతాంగానికి ఆ పార్టీ చేసిన ద్రోహం అంతా ఇంతా కాదని మండిపడ్డారు. అసెంబ్లీ సాక్షిగా రైతులకు రూ.2378 కోట్ల పరిహారం ఇస్తున్నామని ప్రకటించి.. ఎగ్గొట్టలేదా అని జగన్‌ను ప్రశ్నించారు. రైతులకు ఇంత అన్యాయం జరుగుతుంటే అప్పటి ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రశ్నించారా అని నిలదీశారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూక్ష్మ సేద్య పథకంతో పండ్ల తోటలు విస్తారంగా సాగయ్యాయని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎంత మంది రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలు ఇచ్చారో చెప్పే ధైర్యం వైసీపీ నాయకులకు ఉందా అని సవాలు విసిరారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. అన్ని వర్గాలకు మంచి చేయాలనే యోచనలో ముందుకు వెళుతోందని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేనందున కూటమి ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తోందని అన్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆరు నెలలుగా కనిపించని వైసీపీ నాయకులంతా ఇప్పుడు బయటికొచ్చి రైతులపై కమటప్రేమ ప్రదర్శిస్తున్నారని, జిల్లా రైతాంగం వారిని నమ్మే పరిస్థితి లేదని అన్నారు.

రైల్వే డివిజన్‌కు జాతీయ పురస్కారాలు

ఇంధన పరిరక్షణకు వరించిన అవార్డులు


అవార్డును అందుకుంటున్న డీఆర్ఎం విజయ కుమార్

గుంతకల్లు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజన్‌కు రెండు జాతీయ ఇంధన పరిరక్షణ పురస్కారాలు లభించాయి. భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గుంతకల్లు రైల్వే ఆసుపత్రికి, రేణిగుంట రైల్వే స్టేషన్‌కు ఇంధన పరిరక్షణలో ప్రథమ బహుమతి లభించింది. ఢిల్లీలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ నుంచి డివిజన్ అవార్డులను డీఆర్ఎం విజయకుమార్ స్వీకరించారు. గుంతకల్లు రైల్వే ఆసుపత్రిలో గ్రిడ్, జనరేటర్ల ద్వారా ఉత్పత్తి చేసిన విద్యుత్తు కారణంగా 2021-22లో 2.27 లక్షల యూనిట్ల కొనుగోలు విద్యుత్ వినియోగాన్ని 2022-23 సంవత్సరంలో 1.85 లక్షల యూనిట్లకు, 2024-25 నాటికి 0.96 లక్షల యూనిట్లకు తగ్గించారు. రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ఇలాగే 7.17 లక్షల యూనిట్ల వినియోగం నుంచి 2.73 లక్షల యూనిట్లకు కొనుగోలు విద్యుత్ వినియోగాన్ని తగ్గించారు. ఈ కారణంగా డివిజన్‌కు జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులు లభించాయి.

కలిసి ఉండండి

దంపతులను కలిపిన న్యాయాధికారి


దంపతులు ఒక్కటైనట్లు పత్రం అందిస్తున్న న్యాయమూర్తి కంపల్లె శైలజ

హిందూపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): అన్యోన్యంగా ఉన్న దంపతులు మనస్పర్థలతో రెండేళ్ల నుంచి విడిగా ఉంటూ విడాకుల కోసం కోర్టు మెట్లు ఎక్కారు. కానీ న్యాయాధికారి కౌన్సెలింగ్‌తో ఆ దంపతులు ఒక్కటయ్యారు. ఈ సంఘటన హిందూపురంలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో చోటుచేసుకుంది. హిందూపురం మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ, నారాయణలకు 2018లో పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే రెండేళ్ల నుంచి భార్య కాపురానికి రాకపోవడంతో నారాయణ విడాకుల కోసం కోర్టు మెట్లు ఎక్కారు. ఈ పరిస్థితుల్లో లోక్‌అదాలత్‌కు వారిద్దరిని పిలిపించి అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ కౌన్సెలింగ్ ఇచ్చారు. న్యాయాధికారి చెప్పిన మాటలు విని ఇద్దరు కలిసి ఉండటానికి ఒప్పుకున్నారు. దీంతో ఆమె వెంట వచ్చిన కుమారులు ఇద్దరు ఎంతో సంతోషంగా తండ్రి వద్దకు వెళ్లారు. ఇది చూసిన న్యాయాధికారి కంపల్లె శైలజతోపాటు మరో న్యాయాధికారి, న్యాయవాదులు వారిని అభినందించి ఒక్కటైనట్లు పత్రం అందజేసి పంపించారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి


తిప్పమ్మ (ఫైల్)

కదిరి, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలోని మలకవారిపల్లి గ్రామానికి చెందిన తిప్పమ్మ (68) శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందారు. ఎస్ఐ వెంకటనారాయణ తెలిపిన మేరకు మలకవారిపల్లికి చెందిన తిప్పమ్మ తన కుమారై సమాధి వద్ద ముళ్లచెట్లు పెరగడంతో వాటిని తొలగించడానికి వెళ్లారు. అయితే సమాధి పక్కనే పడి ఉన్న విద్యుత్ తీగను గమనించలేదు. విద్యుత్ సరఫరా అవుతున్న ఆ తీగను తాకడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్ఐ వెంకటనారాయణ శవాన్ని పరిశీలించారు. మృతురాలి కుమారుడు భైరారెడ్డి ఫిర్యాదు

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర మైనార్టీ అఫైర్ ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): మైనార్టీ సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర మైనార్టీ అఫైర్ ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్ అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లాకొచ్చిన ఆయన రోడ్లు, భవనాల అతిథి గృహంలో మైనార్టీ సంక్షేమ శాఖ, కార్పొరేషన్, వక్ఫ్‌బోర్డు, మైనార్టీ వసతిగృహాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ.. మైనార్టీల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఆ పథకాలకు అర్హులైన వారికి లబ్ధి అందజేసేందుకు ప్రతి ఒక్క అధికారి చర్యలు తీసుకోవాలన్నారు. మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ ఉమ్మడి జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి వాటిని తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

అనంతరం జడ్పీలోని డీఆర్సీ సమావేశపు హాల్లో జిల్లాలోని ముస్లిం మైనార్టీ సంఘాలు, ఖాజీలు, పెద్దలు, క్రిస్టియన్ మైనార్టీ సంఘాల ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఏ షరీఫ్ మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. వారికందాల్సిన సంక్షేమ పథకాలను పక్కదారి పట్టించి మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఆయా కార్యక్రమాల్లో మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ రామసుబ్బారెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ రహీం, క్రిస్టియన్ మైనార్టీ డీపీఎం మధుసూదన్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్లు సాలార్ బాష, గౌస్‌మొద్దీన్, స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

గార్లదిన్నె: మైనార్టీ గురుకుల పాఠశాలల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంఏ షరీఫ్ పేర్కొన్నారు. గార్లదిన్నెలోని మైనార్టీ గురుకుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాలల్లోని గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంజనేయులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.


షరీఫ్‌ను సన్మానిస్తున్న ఆల్‌మేవా నాయకులు

నిబద్ధతకు నిదర్శనం షరీఫ్

అనంతపురం క్లాక్‌టవర్: నిజాయతీ, అంకితభావం, నిబద్ధతకు నిదర్శనం ఎంఏ షరీఫ్ అని ఆల్‌మేవా నాయకులు కొనియాడారు. జిల్లాకు వచ్చిన ఎంఏ షరీఫ్‌ను శనివారం స్థానిక జిల్లా పరిషత్తు ఆవరణంలోని డీఆర్సీ భవనంలో ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆల్‌మేవా నాయకులు మాట్లాడుతూ షరీఫ్ సేవలను గుర్తించి ప్రభుత్వ మైనార్టీ సలహదారులుగా నియమించడం పట్ల సీఎం చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆల్‌మేవా నాయకులు ఫకృద్దీన్, షెక్షావలీ, ఫరూఖ్, మహ్మద్‌దౌలా, జిలాన్, అన్వర్, అష్రాఫ్, ఆలీబాబా తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 6,235 కేసుల పరిష్కారం

అనంతపురం క్రైం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 6235 కేసులకు పరిష్కారం చూపినట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మెగా లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 25 బెంచులు ద్వారా 5753 క్రిమినల్, 151 సివిల్, 66 మోటారు వాహన ప్రమాద పరిహార కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు. ప్రమాద భరిత కేసులలో కక్షిదారులకు రూ.56750000, సివిల్ కేసులలో రూ.3196134, ప్రీలిటిగేషన్ కేసులలో రూ.12184731 చొప్పున పరిహారం ఇప్పించినట్లు వివరించారు. కక్షిదారులు, ఫిర్యాదిదారులు రాజీకి సమ్మతించడంతో పెద్దఎత్తున పరిష్కారాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జగదీష్, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.


రాజీపత్రాన్ని అందజేస్తున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాసులు, ఎస్పీ జగదీష్

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు

జిల్లా క్రీడాకారుల ఎంపిక


సంతోష్, ఉజ్వలేశ్వర్ సాయి, జీవన్

అనంతపురం క్లాక్ టవర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల 16వ తేదీ నుంచి నిర్వహించే 49వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్- 2024 పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లా క్రీడాకారులు సంతోష్, ఉజ్వలేశ్వర్ సాయి, జీవన్‌లు ఏపీ రాష్ట్రం తరఫున జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి 14వ తేదీ వరకు తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురంలో నిర్వహించిన ఏపీ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ చాటిన క్రీడాకారులు జాతీయ పోటీలకు అర్హత సాధించడం అభినందనీయమని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హబీబుల్లా, నరేంద్రచౌదరి తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కళ్యాణదుర్గం రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎర్ర నేల వీధిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. కర్ణాటక మద్యం విక్రయిస్తున్న అంజలి అనే మహిళ ఇంటిని సోదా చేశారు. 384 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ హసీనాబాను తెలిపారు. ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

విస్తరిస్తున్న పొగాకు సాగు

- ఆసక్తి చూపుతున్న రైతులు
- రెండు మండలాల్లో 150 ఎకరాల్లో సాగు
- ప్రోత్సహిస్తున్న ప్రైవేట్ కంపెనీ



తాడిపత్రి నియోజకవర్గంలో గత రెండు మూడేళ్ల నుంచి పొగాకు సాగుపై రైతులు మక్కువ చూపుతున్నారు. పుట్లూరు, యల్లనూరు మండలాల పరిధిలోని నల్లరేగడి భూముల్లో ఉద్యాన పంటలతోపాటు పొగాకు పంటను సాగు చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఈ ప్రాంతంలో సాగు చేయకపోయినా, కొందరు రైతులు వినూత్నంగా ఆలోచించి పొగాకు పంటను సాగు చేస్తున్నారు. పొగాకు పంటకు మార్కెట్‌లో డిమాండ్, ధర బాగా ఉండటంతో కొందరు రైతులు సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. తక్కువ నీటితోనే ఆశించినస్థాయిలో దిగుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఓ ప్రైవేట్ కంపెనీ ముందుగానే ఒప్పందం చేసుకుని, పొగాకు పంటను కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. యల్లనూరు మండలంలోని వేములపల్లి, గిర్రమ్మబావి, పీఎం కొండాపురం, పుట్లూరు మండలంలోని శనగలగూడూరు, తక్కళ్లపల్లి తదితర గ్రామాల్లో పొగాకు సాగు చేస్తున్నారు. రెండు మండలాల్లో సుమారు 150ఎకరాల్లో పంట సాగుచేస్తున్నారు. - ఆంధ్రజ్యోతి, పుట్లూరు/యల్లనూరు

రాజమండ్రి ప్రాంతం నుంచి మొక్కలు తెచ్చి..

రాజమండ్రి ప్రాంతంలోని నర్సరీల నుంచి ఇక్కడికి పొగాకు మొక్కలను తెస్తున్నారు. ఆ మొక్కలను నాణ్యతను బట్టి 30పైసల నుంచి అర్ధ రూపాయి వరకు రైతులకు నర్సరీల నిర్వాహకులు విక్రయిస్తారు. సాగు చేసిన నాలుగునెలలు తర్వాత ఏపుగా పెరిగినా పంటను కోస్తారు. ముందుగా 70-80రోజుల మధ్యన ఈ ఆకు పండువారి రాలుతుంది. తర్వాత రైతులు ఆ పంటను కోసి 20రోజులపాటు ఎండబెడతారు. ఎండబెట్టిన అనంతరం కంపెనీ ఇచ్చిన బోరా సంచుల్లో వేసి బనగానపల్లిలోని ఓ ప్రైవేట్ కంపెనీకి ట్రాన్స్‌పోర్టు చేస్తారు.

తక్కువ పెట్టుబడి

పొగాకు పంటను తక్కువ పెట్టుబడితో సాగు చేయవచ్చని రైతులు చెబుతున్నారు. ఈ పంటకు నీటి తడులు కూడా అంతంత మాత్రంగా ఉన్నా సరిపోతుంది. ఎకరా పొగాకు పంటకు సుమారు రూ.50 వేలు నుంచి రూ.80వేలు పెట్టుబడి అవుతుంది. కొందరు రైతులు పంట పరిస్థితిని బట్టి డ్రిప్పు సాయంతో నీరు పెడుతున్నారు. ఎకరాకు సుమారు 12నుంచి 18క్వింటాళ్లవరకు దిగుబడి వస్తుంది. వీటికి ఎలాంటి తెగుళ్లు సోకవు. మందులు కూడా పిచికారీ చేయాల్సిన అవసరం లేదని రైతులు చెబుతున్నారు. బోర్లలో నీరు తక్కువ ఉన్న రైతులు పొగాకు పంటపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

క్వింటానికి రూ.15వేల ప్రకారం..

పండించిన పొగాకు పంటను నంద్యాల జిల్లా బనగానపల్లిలోని ఓ ప్రైవేట్ కంపెనీ ముందుగానే కుదుర్చుకున్న ఒప్పందం మేరకు కొనుగోలు చేస్తుంది. రైతులు పంట సాగు సమయంలోనే క్వింటా రూ.15వేలు చొప్పున కంపెనీతో మాట్లాడుకొని వచ్చి, పంట పండిన తర్వాత మొత్తం దిగుబడిని బనగానపల్లికి సరఫరా చేస్తారు. రవాణా ఖర్చులకు సైతం క్వింటాకు రూ.100నుంచి రూ.500లోపు కంపెనీనే ఇస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. విక్రయించిన పంట డబ్బులను నేరుగా రైతుల ఖాతాల్లోకే మరుసటి రోజే జమ చేస్తున్నారు. కంపెనీ ప్రతినిధులు పంట కాలంలో కూడా రైతుల వద్దకు తోటను పరిశీలిస్తుంటారు. రైతులకు పంటపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు, సలహాలు ఇస్తుంటారు. పొగాకు పంట సాగు చేయాలనుకునే రైతులు ఎవరైనా ఉంటే కంపెనీ ప్రతినిధులే నేరుగా వచ్చి వారిని కలుస్తుంటారు.

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి



నేను మూడేళ్ల నుంచి 20 ఎకరాల్లో పొగాకు పంటను సాగుచేస్తున్నా. పంట లాభదాయకంగా ఉంది. పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా ప్రభుత్వం కొంత మేర ప్రోత్సాహం అందిస్తే బాగుంటుంది. ఈ పంట గురించి విషయాలు తెలియని రైతులకు వివరిస్తే ఇంకా సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. ఈ రెండు మండలాల్లో భూగర్భజలాలు అంతంతమాత్రంగానే ఉన్నా పొగాకు సాగుకు సమస్య ఉండదు. ఒక ఇంచు నీరు వచ్చే బోరు ఉన్నా సుమారు ఐదెకరాలకుపైగా పొగాకు పంటను సాగు చేయవచ్చు.

- ప్రకాష్‌నాయుడు, వేములపల్లి

పేక.. ముక్క..!

చిలమకూరు తిరుణాలలో జూదం

పోలీసుల అనుమతితోనే నిర్వహణ..?


ఆలయం వద్ద బహిరంగంగా జూదం

యల్లనూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుణాలలో దుకాణాలను ఏర్పాటు చేయడం సహజం. పోలీసుల కళ్లుగప్పి.. కొందరు మద్యం సేవించడం, పేకాట ఆడటం కూడా పరిపాటి. కానీ, వేడుక జరిగే ప్రాంతానికి కాస్త దూరంగా, మరుగున ఇలాంటి పనులు చేస్తుంటారు. విషయం తెలిస్తే.. పోలీసులు చర్యలు తీసుకుంటారు. కానీ చిలమకూరు ఆంజనేయ స్వామి తిరుణాలలో వ్యవహారం శృతిమించింది. ఏకంగా స్వామివారి ఆలయం పక్కనే పేక.. ముక్క ఆడించారు. పోలీసులు అడిగితే.. 'సార్ అనుమతి తీసుకున్నాం కదా..?' అని ఎదురు ప్రశ్న వేశారు. దీంతో పోలీసు సిబ్బంది అవాక్కయ్యారు. యల్లనూరు మండలం చిలమకూరులో ఏటా ఆంజనేయస్వామి తిరుణాల నిర్వహిస్తారు. ఈ ఏడాది శుక్ర, శనివారాలలో వేడుక ఘనంగా జరిగింది. ఎప్పటిలాగానే గాజులు, బొమ్మలు, తినుబండారాల దుకాణాలు ఏర్పాటయ్యాయి. కానీ ఎన్నడూ లేని విధంగా ఈసారి పేక.. ముక్క (అందర్.. బాహర్) ఆడించారు. శుక్రవారం రాత్రి అంతా ఆట కొనసాగింది. వేలాది రూపాయలు చేతులు మారాయి. ఇంతకూ వీరికి ఏ సారు అనుమతి ఇచ్చారో తెలియదు. 'సార్ అనుమతి ఇచ్చారు కదా..?' అని అనగానే బందోబస్తుకు వెళ్లిన సర్కిల్ పోలీసులు నివ్వెరపోయారు. చర్యలు తీసుకోవాలో.. వదిలేయాలో తెలియక బుర్ర గోక్కున్నారు.

ఆటలో మైనర్‌లు

పేక.. ముక్క ఆటలో పెద్దలతోపాటు మైనర్లు కూడా పాల్గొన్నారు. యువకులతోపాటు పన్నెండేళ్ల బాలుడు పందెం కాస్తూ కనిపించాడు. తిరుణాలకు వచ్చిన భక్తులు ఈ జూదాన్ని చూసి నివ్వెరపోయారు. చదువుకోవాల్సిన పిల్లలను ఇలా తప్పుదారి పట్టిస్తే పరిస్థితి ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ తమ గ్రామంలో ఇలాంటివి చూడలేదని అన్నారు. జూదానికి పోలీసులు నిజంగానే అనుమతులు ఇచ్చారా అనే చర్చ జరుగుతోంది. ఇంత బహిరంగంగా జూదం ఆడుతున్నా పోలీసులు పట్టించుకోలేదంటే.. అనుమతి ఇచ్చే ఉంటారని అంటున్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్స్...

బాపు (జయంతి)



తెలుగునాట పేరెన్నికగన్న బహుముఖ ప్రజ్ఞాశాలి బాపు 19533 డిసెంబరు 15న జన్మించారు. ఆయన అసలుపేరు సత్తిరాజు వెంకట లక్ష్మీనారాయణ. సినీ దర్శకుడిగానే కాక చిత్రకారుడు, కార్టూనిస్ట్‌గా సత్తా పేరొందారు. ముళ్ళపూడి వెంకట రమణ, బాపుల స్నేహద్వయంలో రమణ రాస్తే, బాపు బొమ్మలు గీశారు. ఇలా బాపు గీత, బాపు రాత తెలుగువారి సంస్కృతిలో భాగమయ్యాయి. కోతి కొమ్మచ్చి, బుడుగులు తెలుగుసాహితీవనంలో ప్రత్యేకతగా ఉన్నాయి. ఆయన మొదటిచిత్రం సాక్షి, తర్వాత ఎన్నో వైవిధ్యమైన దృశ్య కావ్యాలను వెండితెరపై సృష్టించారు. నంది పురస్కారాలతో పాటు పద్మశ్రీ అందుకున్నారు. 2014 ఆగస్టు 31న కన్నుమూశారు.

స్వామి రంగనాథానంద (జయంతి)



రామకృష్ణ మఠం, మిషన్‌కు 13వ అధ్యక్షుడిగా పనిచేసిన స్వామి రంగనాథానంద 1908 డిసెంబరు 15న కేరళ రాష్ట్రం త్రిచూర్ సమీపంలోని త్రికూర్ గ్రామంలో జన్మించారు. ఆయన అసలు పేరు శంకరన్ కుట్టి. 14ఏళ్లకే స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంస బోధనలకు ప్రేరితుడయ్యారు. 18వ యేట రామకృష్ణసంఘంలో చేరారు. ఉపనిషత్తులు, గీత, ఇతిహాసాలు, భారతీయ సాంస్కృతిక చరిత్ర, సంస్కృత అధ్యయనం చేశారు. కొంతకాలానికి సన్యాస దీక్ష స్వీకరించి రంగనాథ స్వామి అయ్యారు. 50కుపైగా పుస్తకాలు రచించారు. ఇందిరాగాంధీ శాంతి పురస్కారం అందుకున్నారు. 2005 ఏప్రిల్ 25న నిర్యాణం చెందారు.

వాసిరెడ్డి సీతాదేవి (జయంతి)



ప్రసిద్ధ తెలుగు నవలా రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి 1933 డిసెంబరు 15న గుంటూరు జిల్లా చేబ్రోలులో జన్మించారు. ఈమె తల్లిదండ్రులు చిన్నతనంలోనే చెన్నైకు చేరుకున్నారు. చదివించి ఐదో తరగతి వరకే అయినా ప్రైవేట్‌గా హిందీ ప్రచారక్, ప్రవీణ, సాహిత్యరత్నలో ఉత్తీర్ణులయ్యారు. నాగపూర్ విశ్వవిద్యాలయం నుంచి బిఎ, ఎంఎ పూర్తి చేశారు. తొలి నవల జీవితం అంటే (1950), తొలి కథ సాంబయ్య పెళ్ళి (1952)లో రాశారు. అప్పటినుంచి 39కుపైగా నవలలు, వందకుపైగా కథలు రచించారు. నక్సలిజం గురించి 1982లో రచించిన 'మరీచిక' నవలను రాష్ట్రప్రభుత్వం నిషేధించినా చివరకు హైకోర్టు నిషేధాన్ని తొలగించింది. మట్టిమనిషి (2000) నవల 14భాషలలోకి అనువదించబడింది. ఆమె నవలలు కొన్ని తెలుగు సినిమాలుగా, దూరదర్శన్ సీరియల్స్‌గా ప్రసారమయ్యాయి. 2007 ఏప్రిల్ 13న కన్నుమూశారు.

పెద్దిభొట్ల సుబ్బరామయ్య (జయంతి)



సమకాలీన రచయితలలో పేరొందిన పెద్దిభొట్ల సుబ్బ రామయ్య 1938 డిసెంబరు 15న ప్రకాశం జిల్లా వల్లూరులో జన్మించారు. ఆయన రచనలు అత్యధికం విషాదం మేళవించిన సామాన్య జీవన కథలుగా ఉంటాయి. ఆయన రాసిన పెద్దిభొట్ల సుబ్బరామయ్య కథలు (వాల్యూం1) 2012లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైంది. 1975లో నేషనల్ బుక్ ట్రస్టు గౌరవం దక్కింది. పలు గౌరవాలు అందుకున్నారు. 2018 మే 18న కన్నుమూశారు.

టీఎన్ శేషన్ (జయంతి)



తిరునెల్లై నారాయణ అయ్యర్ శేషన్ (టీఎన్ శేషన్)గా సుపరిచితులు. 1932 డిసెంబరు 15న జన్మించారు. దేశ ఎన్నికల చీఫ్ కమిషనర్‌గా ఆయన తీసుకున్న నిర్ణయాలు ఎన్నికల వ్యవస్థనే మార్చేశాయి. ఎన్నికల విధానంలో ఆయన చేపట్టిన సంస్కరణలు నేటికీ అమలవుతున్నాయి. 1955 ఐఏఎస్ అధికారిగా కీలక హోదాలలో వ్యవహరించారు. 1989లో 18వ కేబినెట్ సెక్రటరీ ఆఫ్ ఇండియాగా పనిచేశారు. ప్రతిష్టాత్మక రామన్ మెగసెసె అవార్డు గ్రహీత. 2019 నవంబరు 19న కన్నుమూశారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ (వర్ధంతి)



దేశ ఉక్కు మనిషిగా పేరొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 1875 అక్టోబరు 31న గుజరాత్ రాష్ట్ర నాడియార్ ప్రాంతంలో జన్మించారు. స్వాతంత్ర్య సమర యోధుడిగానే కాక స్వాతంత్ర్యానంతరం సంస్థానాలను దేశంలో విలీనం కావడానికి కృషి చేసి సఫలీకృతులై పేరొందారు. హైదరాబాద్, జునాగడ్ వంటి సంస్థానాలను విలీనం చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఇంగ్లండ్‌లో బారిష్టర్ పట్టా పొందిన అనంతరం దేశానికి వచ్చాక బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా మహాత్మాగాంధీ నేతృత్వంలో జరుగుతున్న స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని కీలకభూమిక పోషించారు. దేశ తొలి ఉపప్రధానిగా వ్యవహరించారు. భారతరాజ్యాంగ రచనలోనూ ప్రముఖ పాత్ర పోషించారు. 1950 డిసెంబరు 15న కన్నుమూశారు. 1991లో మరణానంతరం భారతరత్న ప్రకటించారు. ఆయన గౌరవార్థం గుజరాత్‌లో 182 మీటర్ల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి స్టాట్యూ ఆఫ్ యూనిటీగా ప్రకటించారు.

పొట్టి శ్రీరాములు (వర్ధంతి)



ఆంధ్రరాష్ట్ర సాధనకోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించి అమరజీవి అయిన మహా పురుషుడు 1901 మార్చి 1న మద్రాస్‌లో జన్మించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడయ్యారు. మహాత్మాగాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాలకోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు. మద్రాస్ రాజధానిగా ఉండే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకోసం 1952లో బులుసు సాంబమూర్తి ఇంట్లో నిరాహారదీక్ష ప్రారంభించాడు. ప్రభుత్వం మాత్రం రాష్ట్రం ఏర్పాటు దిశగా విస్పష్ట ప్రకటన చెయ్యలేదు. చివరికి 1952 డిసెంబరు 15న తన ఆశయాల సాధనకోసం ప్రాణాలర్పించి అమరజీవి అయ్యాడు. చివరకు డిసెంబరు 19న ప్రత్యేకరాష్ట్రం ఏర్పాటు చేస్తూ అప్పటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్‌నెహ్రూ ప్రకటన చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

▸▸ మేఘాలయ గవర్నర్ విజయశంకర్



ప్రసంగిస్తున్న గవర్నర్ విజయశంకర్

బెంగళూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మేఘాలయ గవర్నర్ విజయశంకర్ అభిప్రాయపడ్డారు. మూడో విడత గ్లోబల్ యోగా సమ్మిట్ నగరంలో శనివారం లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ విజయశంకర్ ప్రసంగిస్తూ ప్రతిరోజూ యోగాభ్యాసం చేయడం ద్వారా ఆరోగ్యవృద్ధి సాధ్యమన్నారు. శ్వాసమీద ధ్యానతోపాటు యోగా విన్యాసాలతో శరీరంలోని అన్ని అవయవాలు ఉత్తేజం అవుతాయన్నారు. భారతీయ సంస్కృతిలో యోగా ఒక భాగమన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయస్థాయిలో యోగాను పరిచయం చేసిన ఘనత మనదే అన్నారు. రోటరీ బెంగళూరు, గ్లోబల్ యోగా క్లబ్, స్వామి వివేకానంద యోగా రీసెర్చ్ అండ్ హోలిస్టిక్ హెల్త్ ట్రస్టు, అమెరికా యోగా యూనివర్సిటీ, మియామి, ఫ్లోరిడాల సహభాగత్వంలో రెండు రోజుల గ్లోబల్ యోగా సమ్మిట్ ఏర్పాటు చేశారు. యువ ఇంటర్నేషనల్ స్కాలర్ కులపతి డాక్టర్ అరళుమల్లిగె పార్థసారథి, ఆర్‌బిజివై సమ్మిట్ చార్టర్ చైర్మన్ డాక్టర్ యోగి దేవరాజ్‌లు పాల్గొన్నారు. యోగా శిక్షకులు, ఆయుష్ నిపుణులు సమాజంలో ఆరోగ్య ప్రమాణాలు పెంచేందుకు, తమ అనుభవాలను పంచుకునేందుకు ఓ వేదిక అయ్యిందన్నారు. అంతర్జాతీయ యోగా గురువులు వైదిక, విద్యానిపుణులు భాగస్వామ్యులయ్యారు. ఫ్రాన్స్, ఇంగ్లండ్, రష్యా, ఆస్ట్రేలియా, మలేషియాతోపాటు వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులు

చెరువును స్వచ్ఛపరిచిన ప్రజాప్రతినిధులు



స్వచ్ఛతా అభియానలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు

దొమ్మసంద్ర, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హాలనాయకన హళ్ళి చెరువును గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు సవితా బాబురెడ్డి, పంచాయతీ సభ్యులు, అధికారుల నేతృత్వంలో చేపట్టారు. శనివారం స్వచ్ఛభారత అభియానలో ప్రజా ప్రతినిధులు, అధికారులతోపాటు సాఫ్ట్‌వేర్ కంపెనీలకు చెందిన 60మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. చెరువు 67 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. చెరువు చుట్టుపక్కల ప్రాంతాలలో పేరుకున్న చెత్తా చెదారాన్ని తొలగించారు. బెంగళూరు తూర్పు తాలూకా మహదేవపుర నియోజకవర్గ పరిధిలోని హాలనాయకనహళ్ళి గ్రామ పంచాయతీ అధ్యక్షులు సవితా బాబురెడ్డి, పంచాయతీ సభ్యులు, పీడీఓ నరసింహరాజు, కార్యదర్శి సణ్ణప్పలతో కలసి స్వచ్ఛతా కార్యాచరణలో పాల్గొన్నారు. తొలగించిన చెత్తా చెదారాన్ని 20 ట్రాక్టర్ల ద్వారా తొలగించారు. రెండో శనివారమైనప్పటికీ ప్రజా ప్రతినిధులు స్వచ్ఛతా అభియానలో పాల్గొనడం గమనార్హం. నెలకోసారి చెరువు స్వచ్ఛతా అభియాన చేపట్టదలిచామని, అలాగే చెత్తను ఇష్టం వచ్చినట్టు పడేయకుండా ప్రజలలో చైతన్యం కల్పిస్తామని పంచాయతీ మాజీ సభ్యుడు, సమాజ సేవకుడు బాబురెడ్డి తెలిపారు. హాలనాయకనహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోకి వచ్చే గ్రామాలలో కూడా స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తామని పీడీఓ నరసింహ రాజు తెలిపారు. చెత్తను పడేస్తే రూ.500, వెయ్యి జరిమానా విధించనున్నట్టు ప్రకటిస్తున్నట్టు సర్క్యులర్ పంపామన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి హరీశ్, పంచాయతీకి చెందిన మల్లికార్జున, నవీన్‌కుమార్‌ల జోక్యంతో ఇతర ఉద్యోగులు పాల్గొన్నారన్నారు. గ్రామపంచాయతీ ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి వెంకటేశ్, అనిల్‌కుమార్, శ్వేతా సురేశ్, శివారెడ్డి, మునిరెడ్డి, మంజునాథ్ సి, గీతా లోకేశ్, ప్రదీప్, సుకన్యా హరిబాబు, మంజునాథ్ హెచ్‌ఎం, శోభా రమేశ్, రవిశంకర్, శోభా లోకేశ్, అనితా భీమణ్ణ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

బంగారపేట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కెసరనహళ్ళి పంచాయతీ పరిధిలోని గ్రామాలలో తాగునీరు, విద్యుత్ దీపాలు, స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రజకు ఆరోగ్యం కల్పించడమే లక్ష్యమని గ్రామపంచాయతీ అధ్యక్షురాలు లలితా కపాలిశంకర్ తెలిపారు. తాలూకాలోని కెసరనహళ్ళి గ్రామపంచాయతీలో సామాన్యసభలో పాల్గొని మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలలో శుద్ధతాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు, స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. గత వారం బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలతో గ్రామాలలో రోడ్లు దుస్థితికి చేరుకున్నాయన్నారు. తాగునీరు కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు పాటించేలా వాటర్‌మ్యాన్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చోట్ల బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. 15వ ఆర్థికసంఘం గ్రాంట్ల కింద రూ.38లక్షల యాక్షన్‌ప్లాన్ రూపొందించేందుకు సభలో ఆమోదం పొందారు. నరేగా కింద ఉపాధి కల్పించే పనులు చేపట్టి పేద కూలీలను పట్టణాలకు వలస పోకుండా చూడాలన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షురాలు సత్యగోవిందరాజ్, తాజా మాజీ అధ్యక్షుడు మరవహళ్ళి మంజునాథ్, సభ్యులు గంగాధర్, ప్రదీప్, మమత అంబ రీశ్, కిరణ్ సింగ్, గౌరమ్మ శ్రీనివాస్, పీడీఓ శంకర్, కార్యదర్శి రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



కెసరనహళ్ళి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు లలితా కపాలిశంకర్ తదితరులు

పత్రికలపై గురుతర బాధ్యత



బసవణ్ణదేవరమఠం సిద్ధలింగస్వామిజీ తదితరులు

దొడ్డబళ్ళాపుర, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని లోటుపాట్లను దిద్ది ఉత్తమంగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత పత్రికలపై ఉందని బసవణ్ణ దేవరమఠం సిద్ధలింగస్వామిజీ అభిప్రాయపడ్డారు. నెలమంగల పట్టణంలోని మఠంలో కర్ణాటక కార్యనిరత పాత్రికేయుల సంఘం ఏర్పాటు చేసిన నూతనపదాధికారుల పదవీబాధ్యత కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పత్రికలు సదా సమాజంకోసం పనిచేస్తూనే ఉన్నాయన్నారు. తాలూకాలో మూడు పాత్రికేయ సంఘాలు ఉన్నా బేధాభిప్రాయాలు లేకుండా కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. పాత్రికేయులపై నిత్యం పనిఒత్తిడి అధికంగా ఉంటుందని కావున ఆరోగ్యంపై కూడా దృష్టి సారించలన్నారు. కొత్తగా ఏర్పాటైన సంఘం పదాధికారులను అభినందించారు. సంఘం మరింత బలోపేతం కావాలన్నారు. సంఘంలో మహిళలకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వడంపై అభినందనీయమన్నారు. బీజేపీ తాలూకా అధ్యక్షుడు జగదీశ్ చౌదరి, కార్యనిరత పాత్రికేయుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌లు ప్రసంగించారు. సంఘం తాలూకా అధ్యక్షుడిగా టీ కృష్ణప్ప (బూదిహాల్ కిట్టి), గౌరవాధ్యక్షులుగా ఎన్‌జి గోపాల్, ఉపాధ్యక్షులుగా రంగనాథ్, హెచ్‌సి రుద్రేశ్, కోశాధికారి సుమిత్రాదేవి, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్, కార్యదర్శిగా హెచ్‌పి మహేశ్, 13మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ప్రముఖ గాయకుడు చిక్కమారనహళ్ళి సిద్దయ్య బృందం ఆలపించిన పాటలు సభికులను అలరించాయి.

కేన్సర్‌కు భయపడొద్దు.. జాగ్రత్తలే కీలకం

బెంగళూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రాణాంతకంగా మారిన కేన్సర్ పట్ల భయం కంటే జాగ్రత్తలే కీలకమని ఏస్టర్ హెల్త్‌కేర్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ అజాద్ మూపెన్ అభిప్రాయపడ్డారు. ఏస్టర్ ఆసుపత్రిలో ప్రత్యేక అంకాలజీ విభాగాన్ని ఆరంభించినట్టు ప్రకటించారు. శనివారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ ఆధునాతనమైన సాఫ్ట్‌వేర్ డ్రైవన్ పేషంట్ మేనేజిమెంట్ విధానంతో కేన్సర్ సంరక్షణ చేపట్టదలిచామన్నారు. కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం, నివారణ, మెరుగైన ఆరోగ్యం కోసం ఆధునాతనమైన డేటా విశ్లేషణ ఉపయోగిస్తున్నామన్నారు. డాక్టర్ రమేశ్ నిమ్మగడ్డ కేన్సర్ ఫౌండేషన్ సహకారంతో కేంద్రాలను తెరిచామన్నారు. పరిశోధనా ఆధారిత చికిత్సలను అందించడం ద్వారా కేన్సర్ సంరక్షణలో విప్లవాత్మకమైన మార్పులు సాధ్యమవుతాయన్నారు. ప్రిసిషన్ అంకాలజీ క్లినిక్‌లో రోగియొక్క జినోమిక్ ప్రొఫైల్స్‌తో వ్యాధి ప్రగతిని గుర్తించి చికిత్సలు అందించదలిచామన్నారు.



అంకాలజీ విభాగం ప్రారంభంలో ఏస్టర్ సీఎండీ డాక్టర్ అజాద్ మూపెన్

ఏస్టర్ గ్లోబల్ డైరెక్టర్ డాక్టర్ సోమశేఖర్, నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జెబా మూపెన్, అంకాలజీ హెచ్‌ఓడీ సీఎస్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఇంటి ముందు నిరసన

రాయచూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుకు సంబంధించి తక్షణం రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసేలా ఎమ్మెల్యేలు, మంత్రులు ఒత్తిడి తేవాలని మాదిగ దండోరా, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. వర్గీకరణ అమలులో ప్రభుత్వం చేస్తున్న జాప్యాన్ని నిరశిస్తు శనివారం నగరంలో మాదిగ దండోరా, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు మంత్రి ఎన్.ఎస్.భోసరాజు, సిటీ ఎమ్మెల్యే డా.శివరాజ్ పాటీల్ ఇళ్ల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సమితి నాయకుడు నరసప్ప, సుప్రీంకోర్టు ఇప్పటికే వర్గీకరణకు సంబంధించి స్పష్టమైన తీర్పు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికి చట్టం చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని ప్రస్తుతం జరుగుతున్న బెళగావి శీతాకాల శాసనసభ సమావేశంలోనే బిల్లు తెచ్చేలా ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని మంత్రిని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి పర్సనల్ సెక్రటరీకి వినతి పత్రం అందజేశారు. అనంతరం సిటీ ఎమ్మెల్యే డా.శివరాజ్ పాటీల్ ఇంటి ముందు ధర్నా చేసిన నిరసనకారులు వర్గీకరణ కోసం ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని కోరుతు వినతి పత్రం అందజేశారు.

రేపు బెంగళూరులో పీడిత వర్గాల సమావేశం

రాయచూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ బద్ధమైన హక్కులను నోచుకోకుండా అణగారిన వర్గాలుగా మిగిలిన పీడిత వర్గాల ప్రజల్లో చైతన్యం తేవడమే లక్ష్యంగా ఈ నెల 16న బెంగళూరులో ప్రత్యేక సదస్సును నిర్వహిస్తున్నట్లు కర్ణాటక జనశక్తి కన్వీనర్ మారెప్ప అరివి తెలిపారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దేశంలోని పౌరులందరికి ప్రాంతం, కులం, మతం, లింగ వివక్ష లేకుండా పౌర హక్కులు కల్పించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ఈ సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యాంగ పరంగా లభించిన హక్కులను కొంతమంది బలవంతంగా రాజకీయ అండతో తాము దక్కించుకోవడమే గాక బలహీన వర్గాలకు రాజ్యాంగపరమైన హక్కులను అందకుండా చేస్తున్న కుట్రలను సదస్సు ద్వార తిప్పికొడుతామన్నారు. ఈ క్రమంలో బడుగు బలహీన వర్గాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలను చైతన్య పరచడమే సదస్సు ఉద్దేశమని సదస్సును కన్నడ అభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు పురుషోత్తమ్ ప్రారంభించనుండగా సీనియర్ దళిత పోరాట సమితి నాయకుడు వెంకటేశ్ ప్రదాన ఉపన్యాసం చేస్తారన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కర్ణాటక జనశక్తి కన్వీనర్ మారెప్ప అరివి

క్రీడలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలి

▸▸ డీఎస్పీ మురళీధర్

చింతామణి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత స్మార్ట్ యుగంలో క్రీడలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఎస్పీ మురళీధర్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని రాయల్ స్కూల్ 34వవార్షిక క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక సామర్థ్యం పెరుగుతుందన్నారు. కేవలం పాఠాలకే పరిమితం కాకుండా తరచుగా క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఉపశమనం సాధ్యమన్నారు. తద్వారా ఏకాగ్రత కూడా పెరుగుతుందన్నారు. ఉదాహరణకు ఇటీవల చెస్ పోటీల్లో అండర్ 18 విభాగంలో వరల్డ్ చాంపియన్ గుకేశ్ దొమ్మరాజును ప్రస్తావించారు. ఇలా తమకు ఆసక్తి కల్గిన పోటీల్లో రాణిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందవచ్చునన్నారు. కాగా పిల్లలను సాధ్యమైనంత మేర పిల్ల లను సోషల్‌మీడియాకు దూరంగా ఉంచాలన్నారు. ఆడ పిల్లల ఫోటోలను సోషల్‌మీడియాకు పోస్ట్ చేయవద్దని హితవు పలికారు. అనుకోని సమస్యలు ఎదురైతే పోలీసులు లేదా బాలల హెల్ప్‌లైన్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థ అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి ప్రేమలతా, డైరెక్టర్ జీవీకే రెడ్డి, ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



క్రీడాపోటీల ప్రారంభోత్సవంలో డీఎస్పీ మురళీధర్ తదితరులు

సాగులో సాంకేతికత ఉపయోగించుకోవాలి

శిడ్లఘట్ట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం, ఉద్యానవనాలు, పట్టు పెంపకం ఏదైనాగానీ సరికొత్త సాంకేతికతను సద్వినియోగం చేసుకోవడం ద్వారా దిగుబడి పెంచుకునే దిశగా రైతులు అడుగులు వేయాలని కృషి పండిత్ పురస్కార గ్రహీత ఇత్లహళ్ళి గోపాల్‌గౌడ అభిప్రాయపడ్డారు. బాగలకోటె ఉద్యానవనాల విశ్వవిద్యాలయం పిలుపుతో ఉద్యానవనాలు పరిశోధన, విస్తరణ కేంద్రం అఖిలభారత గోడంబి పరిశోధనా పథకం, శిడ్లఘట్ట ఉద్యానవనాలశాఖ ఆధ్వర్యంలో తాలూకాలోని వీరప్పనహళ్ళిలోని గోడంబి సంస్కార విభాగంలో రైతులకు తర్ఫీదు శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలి కాలంలో గోడంబి, మామిడి, నేరేడు, దానిమ్మ ఇతర పంటల దిగుబడి ప్రమాణం పెరిగిందన్నారు. వీటికితోడు పలు రకాల పులు, కూరగాయలను కూడా ఈ ప్రాంతంలో పెంచుతున్నారన్నారు. గోడంబి పంట సాగులో ఎక్కువ దిగుబడికోసం శాస్త్రీయ విధానాలు అమలు చేయాలన్నారు. ఈ దిశగా రైతులకు ప్రభుత్వం తర్ఫీదు ఇస్తోందన్నారు. తద్వారా అందరినీ ఆదర్శరైతులకు తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. బాగలకోటె ఉద్యానవనాల సైంటిస్టుల విశ్వ విద్యాలయం డైరెక్టర్ డాక్టర్ ఫక్రుద్దీన్, తోటల పరిశోధన, విస్తరణా కేంద్రం డైరెక్టర్ ఎస్‌ఎల్ జగదీశ్, ఉద్యానవనాల ఉపసహాయక డైరెక్టర్ మంజుళ, కొత్తనూరు గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు పార్వతమ్మ, ఉపాధ్యక్షుడు నరేంద్ర, గోడంబి సంస్కరణ కేంద్రం యజమాని వెంకటేశ్‌స్వామి, డాక్టర్ ఎన్ అశ్వత్ నారాయణరెడ్డి, డాక్టర్ జగదీశ్, తేజస్ స్వరూపరెడ్డి, డాక్టర్ శ్రీకంత ప్రసాద నర సిం హ మూర్తి, కద్రి నాయకనహళ్ళి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



రైతుల శిక్షణా శిబిరం ప్రారంభోత్సవంలో గోపాల్‌గౌడ తదితరులు

రేపు హుణసేహళ్లిలో విద్యుత్‌కోత

శిడ్లఘట్ట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హుణసేహళ్ళి 66/11కేవీ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మత్తు పనుల రీత్యా ఈనెల 16న విద్యుత్‌కోత ఉండనుంది. సోమవారం ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 6వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బెస్కాం అధికారులు తెలిపారు. కూతండహళ్ళి, సాదహళ్ళి, మరళ్ళి, చౌడరెడ్డిహళ్ళి, తాతళ్ళి సిద్దాపుర చుట్టుపక్కల గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

యువకులు సైన్యంలో చేరేలా శిక్షణ

రాయచూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో సైన్యంలో చేరి దేశ సేవలో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా వారికి శిక్షణనిస్తున్నట్లు రిటైర్డ్ ఆర్మీ అధికారి,ఫ్యూచర్ సోల్జర్ అకాడమీ అధ్యక్షుడైన ఎండీ సలీం హుసేన్ తెలిపారు. యువతకు శిక్షణనిచ్చే ఉద్దేశంతోనే తాను ఫ్యూచర్ సోల్జర్ అకాడమీ పేరుతో శిక్షణ సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తాను 21 ఏళ్ల పాటు కోబ్రా కమాండో సీఆర్‌పీఎఫ్‌లో విధులు నిర్వహించి పదవి విరమణ చేశానన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.36	1,591.19
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	4,478	658
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	5,971	1,924
నీటి నిల్వ (టీఎంసీలు)	91.68	12.06




అలంకరణలో హనుమంతుడు, సిద్ధమవుతున్న రథం

నేడు రథోత్సవం

సిరుగుప్ప, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పేటే ఆంజనేయస్వామి రథోత్సవం ఆదివారం నిర్వహించ నున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్యామాచార్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పల్లకీ సేవ, తుంగభద్ర నది నుంచి గంగమ్మ దేవికి పూజలు జరిపి కుంభ మహోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. పంచామృతాభిషేకం, పూర్ణకుంభాభిషేకం, మహా మంగళహారతి కార్యక్రమాలు చేపడ్తామన్నారు. సాయంత్రం ఆలయం నుంచి జైన మందిరం వరకు రథోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు.

నూతన అధ్యక్షుడి ఎంపిక



కందుకూరి రాముడు

బళ్లారి రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బళ్లారి కేయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడిగా కందుకూరు రాముడును ఎంపిక చేశారు. రాజ్యాధ్యక్షుడు బంగ్లి మల్లికార్జున ఆధ్వర్యంలో కందుకూరు రాముడుకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలో సంఘం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

పడిపోతున్నా పట్టించుకోం..!

బళ్లారి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): అది ప్రధాన రహదారి..నిత్యం వందల మంది ప్రయాణిస్తుంటారు.. అలాంటి దారి మరమ్మతులపైనా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. బళ్లారిలో సత్యనారాయణపేట(ఎస్ఎన్ పేట) వద్ద అండర్ బ్రిడ్జి ప్రధాన రహదారి. నగరవాసులు బీకేఎస్, అమృతల్యాబ్ గాంధీనగర్ వైపు వెళ్లడానికి ఇదే ప్రధాన మార్గం. ఇటీవల కాలంలో అండర్‌బ్రిడ్జి పనులు చేపట్టారు. అక్కడ నీరు వెళ్లడానికి లోన పైపులు వేసి దాని పైన ఇనుప కడ్డీలతో తయారు చేసిన ఒక ఐరన్ ర్యాంప్ వేశారు. అయితే ఐరన్ ర్యాంప్ కు అమర్చిన ఇనుప కడ్డీలు కొనబాగంలో పైకి లేచి ప్రమాదంగా మారాయి. ద్విచక్రవాహనాలు, ఆటోలు, సైకిళ్లలో అధిక మంది ఈ మార్గం గుండానే ప్రయాణిస్తుంటారు. ఇటీవల పలువురు వాహనదారులు ఈ ప్రాంతంలో కింద పడి గాయాలపాలయ్యారు. అయినా మరమ్మతులు చేపట్టక పోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

బాలికలు ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి

● పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి ● సమాజంపై అవగాహన తప్పనిసరి: మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నాగలక్ష్మి

బళ్లారి సిటీ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలికలు తమ ఉజ్వల భవిష్యత్తును తామే నిర్మించుకోవాలని, సమగ్ర లక్ష్యంతో ముందుకు సాగాలని, లక్ష్యాన్ని చేరుకునే వరకు విశ్రమించవద్దని కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నాగలక్ష్మి చౌదరి విద్యార్థులకు సూచించారు. శనివారం ప్రభుత్వ ప్రథమశ్రేణి మహిళా కళాశాల ఆధ్వర్యంలో ప్రస్తుత విద్యా కార్యక్రమం సాంస్కృతిక, క్రీడలు, ఎన్ఎస్ఎస్ యూత్ రెడ్‌క్రాస్, వివిధ కమిటీలు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె బాలికలు సభ్యసమాజంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అన్ని రంగాల్లో చురుగ్గా పాల్గొని విజయం సాధించాలన్నారు. తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తును చూడాలని తల్లిదండ్రులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. విద్యార్థులు తమ కలలను నెరవేర్చుకోవాలనే ఆశతో ఉండాలి. సమాజంలో ఉన్నత స్థానంలో ఉండాలన్నారు. అనంతరం ఆమెతో మాట్లాడిన విద్యార్థులు కళాశాలలో 349మంది విద్యార్థినులకు కేవలం రెండు మరుగుదొడ్లు సరిపోవడం లేదన్నారు. విద్యార్థినుల సంఖ్య ప్రకారం మరికొన్ని మరుగుదొడ్లు అవసరమని, రానున్న రోజుల్లో మరుగుదొడ్లు నిర్మించాలని జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. తదుపరి బిమ్స్ ఆసుపత్రిని సందర్శించి అక్కడిపరిస్థితులపై చర్చించి అధికారుల నుంచి సమాచారం తెలుసుకున్నారు. ఈసందర్భంగా మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు విజయ్‌కుమార్, వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి జలాలప్ప, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమాధికారి డాక్టర్ రమేశ్‌బాబు, కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ వీరరాఘవులు, ప్రిన్సిపాల్ ప్రజ్ఞా, సిబ్బంది, విద్యార్థులు పాల్గొనారు.



నాగలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

ఛైర్‌పర్సన్ దృష్టికి గార్మెంట్ సమస్యలు

బళ్లారి : గార్మెంట్ వ్యాపారులు, జీన్స్ వాషింగ్ యూనిట్లు యజమానులు, శనివారం రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ నాగలక్ష్మి చౌదరిని కలిసి పలు సమస్యలు వివరించారు. స్థానిక బాలాంజనేయ స్వామి సమీపంలోని కాంద్రా సతీష్ ఇంట్లో ఆమెను కలిశారు. సమస్యలపై స్పందించిన ఆమె గార్మెంట్స్, వాషింగ్ యూనిట్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాం అయ్యేలా చూస్తామన్నారు.

చదువుతో పాటు క్రీడలు తప్పనిసరి: ఎస్పీ

బళ్లారి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాలల్లో చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని, ఆటలు శారీరక ఎదుగుదలకు ఉపయోగపడతాయని ఎస్పీ శోభారాణి సూచించారు. బళ్లారి క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న అంతర్ జిల్లా సబ్ జూనియర్ హాకీ పోటీలు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. శనివారం క్రీడాకారులను ఎస్పీ పలకరించారు. బళ్లారి జట్టు మూడు మ్యాచులు గెలిచి సెమీఫైనల్ బెర్తు ఖరారు చేసుకుంది. టోర్నమెంట్‌కు బళ్లారి, ధార్వాడ్, గదగ్, వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. తొలిసెమీఫైనల్‌లో బళ్లారి, గడగ్ జిల్లాలు పోటీపడుతున్నాయి. ఫ్లడ్ లైట్స్ వెలుగులో రాత్రి జరుగుతున్న హాకీ పోటీలను తిలకించేందుకు భారీగా తరలివచ్చారు. 21వ వార్డు కార్పొరేటర్ సురేఖ మల్లనగౌడ రూ. 20 వేలు నగదు బహుమతి అందించి క్రీడాకారులను ప్రోత్సహించారు.



క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎస్పీ శోభారాణి

నేడు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కంప్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తాలూకా సమీపంలోని సన్నాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని బసవేశ్వర క్యాంపులో ఆదివారం విగ్రహ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శివరామ కృష్ణ శర్మ (శివాజీ) పురోహితుల నేతృత్వంలో శనివారం గోపూజ, మహాగణపతి పూజ, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన, గణపతి హోమం, వాస్తు హోమం, మండపారాధన తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు. మూడు రోజులుగా బసవేశ్వర క్యాంపులో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా శుక్ర, శని, ఆది వారాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు వెంకట్రాజు తెలిపారు. ఆదివారం విగ్రహప్రతిష్ఠలో ప్రముఖులు, నాయకులు పాల్గొంటారనాన్నరు. భక్తులు భారీగా తరలిరానున్నారన్నారు. గంగావతి తాలుకా హోసకేరి క్యాంపు సతీష్ రామానుజ గురువుల ఆధ్వర్యంలో హరేశ్రీనివాస భజన కోలాట బృందం కూడా ఆకట్టుకుంది.



సిద్ధమవుతున్న విగ్రహం



హోమాలు నిర్వహిస్తున్న భక్తులు



స్వామికి అభిషేకం

మానవ హక్కులు అమలు చేయాలి

● హక్కుల సంఘం నాయకులు శ్రీరాములు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్రీరాములు

బళ్లారి సిటీ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సమాజంలో మానవహక్కుల అమలు చాలా ముఖ్యమని సీపీడీఆర్ ఎస్ రాష్ట్ర సమన్వయకర్త శ్రీరాములు పేర్కొన్నారు. నగరంలోని వుంకి సన్నరుద్రప్ప న్యాయ కళాశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని కళాశాల అడ్మినిస్ట్రేషన్, సీపీడీఆర్ ఎస్(సెంటర్ ఫర్ డెమోక్రటిక్ రైట్స్ అండ్ సెక్యులరిజం) బళ్లారి సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మానవ హక్కులువిలువలతో కూడుకున్నవని, వాటి చలామణి ఏ స్వార్థం కోసం కాదని, ఏ వ్యక్తికైనా,సమాజ ప్రయోజనాల కోసం కొనసాగితే సమాజం ఎదగడం సాధ్యమవుతుందన్నారు. ఇప్పుడున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మానవ హక్కుల కమిషన్లు హక్కులపై దృష్టి పెట్టలేదన్నారు. సమాజంలో మార్పు రావాలంటే హక్కులు తప్పనిసరిగా అమలు కావాలన్నారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రజనీ కుమారి, సీపీడీఆర్‌ఎస్ కన్వీనర్ సోమశేఖర్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో న్యాయాధికారులు శాంత, రాజేశ్ హొసమనె

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

● బాధితులు సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా న్యాయాధికారి శాంత

బళ్లారి సిటీ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం సాధ్యమవుతుందని, బాధితులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికారి శాంత పేర్కొన్నారు. బళ్లారి, విజయనగరం జిల్లాతో పాటు 31కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. నగరంలోని తాలూరు రోడ్డులోని జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లోని అన్ని కోర్టుల్లో నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌లను ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జీ , జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్ శాంతి స్వయంగా పాల్గొని కేసులను పరిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పార్టీలు తమ వివాదాలను పరస్పరం రాజీతో పరిష్కరించుకుని మెరుగైన జీవనం సాగించేందుకు ఇదొక అవకాశం అన్నారు. కుటుంబ న్యాయస్థానంలో జరిగిన లోక్ అదాలత్‌లో కేసు పరిష్కార సమయంలో భార్యభర్తల మధ్య పరస్పర నమ్మకం, విశ్వాసం ఉన్నప్పుడే మంచి జీవితం సాధ్యమవుతుందన్నారు. సత్వర న్యాయం కోసం కక్ష సాధింపు చర్యలు చేపట్టి జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొంటే పెండింగ్ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకుని సామరస్య జీవనం సాగించవచ్చన్నారు. ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించడంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తామన్నారు. అఖండ జిల్లాలోని 31 కోర్టుల్లో మొత్తం 65.278 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో 12,828 కేసులను రాజీ ద్వారా పరిష్కరించేందుకు గుర్తించామన్నారు. వీటిలో ఇప్పటికే దాదాపు 300 కేసులు రాజీ ద్వారా పరిష్కరించబడ్డాయి. 3లక్షలకు పైగా ప్రీ లిటిగేషన్ కేసులు కూడా పరిష్కరించారు. ఈసంవత్సరం చివరి లోక్ అదాలత్ విజయవంతమైంది. సీనియర్ సివిల్ న్యాయాధికారి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ రాజేశ్ హొసమనెమాట్లాడుతూ సహకరించిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు, ప్రభుత్వ అధికారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఫ్యామిలీ కోర్టు ప్రధాన న్యాయాధికారి సిద్దలింగప్రభు, 1వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి విద్యాధర శిరహట్టి, 2వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి ప్రమోద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నిరసన



ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నిరసనలో మాదిగదండోరా సభ్యులు

బళ్లారి సిటీ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): అంతర్గత రిజర్వేషన్లు అమలు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి డిమాండ్ చేసింది. శనివారం నగరంలోని ఎమ్మెల్యేలు భరత్‌రెడ్డి, నాగేంద్ర కార్యాలయం ఎదుట మాదిగ, సమగర, మోచగర, దోహర, డక్కలిగకులం ఉప సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా మాదిగ రిజర్వేషన్ జిల్లా అధ్యక్షుడు హులుగప్ప మాట్లాడుతూ గత ఆగస్టు 1న ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు అంతర్గత రిజర్వేషన్లు అమలు చేయాలని సుప్రీం కోర్టు తీర్పునిచ్చిందని అయినా రాష్ట్రంలో ప్రభుత్వం ఇంకా నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. హరియాణా బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే ఆ తీర్పును వెలువరించిన వారంలోపే రిజర్వేషన్లను అమలు చేసిందని, కానీ కర్ణాటక ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించలేదన్నారు. ఏజే సదాశివ నివేదికను ప్రభుత్వానికి అందజేసి ఏళ్ళుగడుస్తున్నా అంతర్గత రిజర్వేషన్ అమలుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఏమీ లేవన్నారు. రాష్ట్రప్రభుత్వం మరో కమిషన్‌ను ఏర్పాటు చేసి అంతర్గత రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పడం తగదన్నారు. కుంటి సాకులు చెబుతూ రిజర్వేషన్లుఅమలు చేయకుండా మోసం చేస్తోందాన్నరు. శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, జిల్లా ఎమ్మెల్యేలు దీనిపై ప్రశ్నించాలన్నారు. హులుగప్ప, ఈశ్వరప్ప, దురుగేశ్, నెట్టప్ప పాల్గొన్నారు.

పిల్లలను మొబైల్‌కు దూరంగా ఉంచండి

● తల్లిదండ్రులకు సమాజసేవకుడు దొగ్గ బసవరాజు సూచన



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బసవరాజు

కంప్లి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు తల్లిదండ్రులు మొబైల్‌కు బదులుగా పుస్తకాలు చదవడం అలవరచాలని సమాజసేవకుడు దొగ్గ బసవరాజు తెలిపారు. శనివారం కంప్లి పట్టణంలోని వీరశైవ సంఘంశారదా పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పిల్లలు చిన్నతనంలోనే మొబైళ్లకు బానిస అవుతున్నారని, తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను పనికి పంపకుండా, బడికి పంపి విద్యావంతులు చేయాలన్నారు. అనంతరం వివిధ గీతాలకు పిల్లలు నృత్యాలతో అలరించారు. ఈకార్యక్రమంలో అధ్యక్షుడు మూకయ్య స్వామి, చంద్రయ్య, అరివి బసవనగౌడ, విద్యాధర, నాగరాజు, విరుపాక్షప్ప, గాలి కొట్రప్ప, ఈరప్ప, చంద్రశేఖర్ ప్రధానోపాధ్యాయులు బసవరాజు, తిప్పన్న, శ్వేత పాల్గొన్నారు.

ఉల్లికోడు తెగులుతో రైతులకు ఇబ్బందులు



కడ్డీలతో మంచును తొలగిస్తున్న రైతు

కంప్లి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని సన్నాపురం, ఇటిగి, మన్నూరు, సూగూరు, నారాయణ స్వామి క్యాంపు, బసవేశ్వర క్యాంపు, బెళగోడుహాల్, నెంబర్2 ముద్దాపురం నదీ పరివాహక ప్రాంతాల్లో రైతులు రబీ పంట కోసం నారుమళ్లు సిద్ధం చేస్తున్నారు. కానీ నారుమళ్లకు ఉల్లికోడు తెగులు సోకుతున్నాయని అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగులు వల్ల నారుమళ్లు దెబ్బతిని, నష్టపోతున్నామని, ఎకరాకు రూ. మూడు వేల వరకు నష్టం వాటిల్లుతోందని రైతు అచ్యుతరాయ వర్మ వాపోయారు. ఈ విషయంపై వ్యవసాయ శాఖ అధికారి సోమశేఖర్‌కు నదీ ఒడ్డున వుండే గ్రామాలు ముందుగానీ పంటలు కోసుకుని నారుమళ్లు సిద్ధం చేసుకున్నారు. చలి, మంచు, వాతావరణంలో మార్పుల వలన వీటికి ఉల్లికోడు తెగులు సోకింది. ఈ విషయంపై వ్యవసాయాధికారులను సంప్రదించగా వారు పంటలను పరిశీలిస్తామని తెలిపారు. రైతులు పొడవైన కట్టితో ఉదయాన్నే నారుమళ్లపై కూర్చున్న మంచును తీసివేయాలి అలాగే క్లోరోఫైరిపాస్, స్రిప్రోనిల్, టార్ఫోపార్మరన్ మందులను పిచికారి చేసుకుంటే తెగులు కొద్ది వరకు నివారించవచ్చని సూచించారు. నారుమళ్లకు నీరు తగినంతే వుంచాలని, ఎక్కువగా వుంచితే నష్టపోతారని తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి: డీసీ

రాయచూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల కార్మిక పద్ధతి నిర్మూలన కోసం అధికారులు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా అధికారి నితీశ్ ఆదేశించారు. ఈ విషయంలో ఇప్పటికే ఏర్పాటైన జిల్లా తాలూకా స్థాయి సమన్వయ సమితిలు టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఎప్పటికప్పుడు తమ పని తీరును సమీక్షించుకుంటు విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. శనివారం నగరంలోని జిల్లాధికారి కార్యాలయంలో బాల కార్మిక నిర్మూలన పద్ధతికి సంబంధించి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో జిల్లాధికారి వివిధ శాఖల అధికారులకు దశదిశ నిర్దేశం చేశారు. తాలూకా, జిల్లా స్థాయిల్లో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తు సమీక్ష నిర్వహించడంతో పాటు ఎక్కడ బాల కార్మికులు ఉన్నట్లు తెలిసినా వెంటనే అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డీసీ నితీశ్

'తోరణగల్లు చరిత్ర' పుస్తకం విడుదల

తోరణగల్లు, డిసెంబరు 14 (ఆంధ్ర జ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల భవనంలో శనివారం ప్రముఖ తోరణగల్లు సాహితీవేత్త అబ్దుల్ హై రచించిన తోరణగల్లు చరిత్ర అధ్యయన పుస్తకాన్ని శనివారం విడుదల చేశారు. కన్నడ పుస్తక ప్రాధికార మాజీ అధ్యక్షుడు డాక్టర్ వసుందర శనివరం పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకంతో తోరణగల్లు చరిత్ర ప్రతి ఒక్కరికీ తెలుస్తుందన్నారు. బెంగళూరు సంస్కృతి చింతకుల శంకరప్ప, ప్రముఖులు అంగడి మల్లికార్జున ఈ పుస్తకంలో ఇంకా చేర్చవలసిన విషయాల గురించి చెప్పారన్నారు. అనంతరం రచయితను ఘనంగా సత్కరించారు. కవులు నీలమ్మ ఇబ్రహీం ఖలీల్, సిద్ధార్థ సయ్యద్ సికిందర్ మనీషా, స్నేహలత పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రచయితను సన్మానిస్తున్న కవులు

హోసూరు జోన్

ఇళంగోవన్‌కు కాంగ్రెస్ నివాళి



సంతాప కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు

హోసూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి ఈకేవీఎస్ ఇళంగోవన్, ఈరోడ్ ఎమ్మెల్యే ఇళంగోవన్ మృతి పట్ల హోసూరు పశ్చిమ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం నివాళులు అర్పించారు. తమిళనాడు వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేరీతిన హోసూరు నగరంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద, సీతారాంమేడులో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కృష్ణగిరి పశ్చిమ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మురళీధరన్, మున్సిపల్ అధ్యక్షుడు త్యాగరాజన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు సరోజ, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ఇర్షాద్ కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు అసేన్, పలువురు జిల్లా మున్సిపల్ కార్యదర్శులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

మంత్రితో హోస్టియా ప్రతినిధుల భేటీ

హోసూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరికి వచ్చిన పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌పీ రాజా, మంత్రి చక్రపాణిలను హోసూరు స్మాల్ అండ్ టినీ ఇండస్ట్రీస్ అసోసియేషన్ (హోస్టియా) నిర్వాహకులు భేటీ అయి వినతిపత్రం సమర్పించారు. పారిశ్రామిక రంగానికి చెందిన వివిధ డిమాండ్లను ప్రస్తావించారు. ప్రధానంగా హోసూరు హోసూరు వ్యాపార కేంద్రం, హోసూరు మెట్రో విస్తరణ, విమానాశ్రయం క్లియరెన్స్, శూలగిరి, సిప్‌కాట్‌ను త్వరితగతిన పూర్తిచేయడం వంటి వివిధ డిమాండ్లపై వినతిలో పేర్కొన్నారు. మంత్రిని భేటీ అయిన బృందంలో అసోసియేషన్ అధ్యక్షుడు మూర్తి, కార్యదర్శి శ్రీధరన్, కోశాధికారి వడివేలు పాల్గొన్నారు.

వారాంతంలో ట్రాఫిక్‌జామ్

హోసూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హోసూరు జాతీయ రహదారిపై జరుగుతున్న ఫ్లైఓవర్ పనులు, వారాంతం కావడంతో వాహనాల రద్దీ పెరిగి ట్రాఫిక్‌జామ్ నెలకొంది. సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం టోల్‌ప్లాజా నుంచి సుమారు 5 కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై కృష్ణగిరి జిల్లాలోని హోసూరు మీదుగా సిప్‌కాట్-1 వద్ద ఫ్లైఓవర్ పనులు కొనసాగుతుండడంతో కొన్ని నెలలుగా అన్ని వాహనాలను సర్వీసు రోడ్డుపైకి మళ్లించడంతో వారాంతంలో ట్రాఫిక్ రద్దీ ఉంటోంది. కర్ణాటక రాష్ట్రం అత్తిబెలె సరిహద్దు దాకా ట్రాఫిక్‌కు సమస్య నెలకొంది.

